'మల్లన్న' ఉత్సవ కమిటీ నియామకం

కొమురవెల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లన్న ఆలయానికి ఉత్సవ కమిటీ నియామకమైంది. స్వామివారి బ్రహ్మోత్సవాలు, వచ్చేనెల 14న కల్యాణం నేపథ్యంలో పర్యవేక్షణకు 12 మందితో కమిటీని నియమిస్తూ మంగళవారం దేవదాయశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీలో నర్సింహరెడ్డి, కొమురయ్య, నరేష్‌గౌడ్, మహేష్, వరలక్ష్మి, సత్యనారాయణ, శ్రీనివాస్, లింగం, ప్రవీణ్ కుమార్‌యాదవ్, మల్లేషం, ఎల్లయ్య, గొరిగె రవి నియమితులయ్యారు. వచ్చే నెల 10 నుంచి మార్చి 21, 2026 వరకు ఈ కమిటీ ఉంటుంది.


మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల చెక్కు అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మహిళా సాధికారతకు కృషి

- మంత్రి పొన్నం ప్రభాకర్
- రూ.5.66 కోట్ల రుణాలు అందజేత

హుస్నాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వడ్డీ లేని రుణాలతో మహిళా సాధికారత సాధ్యమవుతుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో నియోజకవర్గానికి చెందిన ఏడు మండలాల స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 5329 స్వయం సహాయక సంఘాలకు రూ.5.66 కోట్ల రుణాలు అందజేశారు. అందులో హుస్నాబాద్ మండలంలోని 445 మహిళా సంఘాలకు రూ.46 లక్షలు, అక్కన్నపేటలోని 754 సంఘాలకు రూ.85 లక్షలు, కోహెడలోని 964 సంఘాలకు రూ.1.18 కోట్లు, చిగురుమామిడిలోని 821 సంఘాలకు రూ.86 లక్షలు, సైదాపూర్‌లోని 703 సంఘాలకు 86 లక్షలు, ఎల్కతుర్తిలోని 775 మహిళా సంఘాలకు రూ.74.42 లక్షలు, భీమదేవరపల్లిలోని 867 సంఘాలకు రూ.85.16 లక్షల విలువగల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట, కరీంనగర్ డీఆర్డీవోలు జయదేవ్ అర్యా, అడిషనల్ డీఆర్‌డీవోలు రవి కుమార్, వెంకటేష్ తదితరులున్నారు.

గ్రామపంచాయతీ ఎన్నికలపై..

కాంగ్రెస్ కార్యకర్తలకు జగ్గారెడ్డి దిశానిర్దేశం

- సంగారెడ్డి నియోజకవర్గంలోని 84 గ్రామాల ముఖ్యనేతలు, కార్యకర్తలతో సమావేశం
- గ్రామాలవారీగా రిజర్వేషన్లపై ఆరా..
- అభ్యర్థుల ఎంపికపై సూచనలు
- ఎన్నికల కమిటీ సభ్యులుగా చేర్యాల ఆంజనేయులు, నిర్మల, తోపాజీ అనంతకిషన్, సీడీసీ రాంరెడ్డి, తొగర్‌పల్లి ప్రభు, చిద్రుప్ప రఘుల ఎంపిక
- ఆరుగురితోపాటు 4 మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు వాళ్ల పరిధిలోని గ్రామాలను పర్యవేక్షించాలని సూచించిన జగ్గారెడ్డి

సంగారెడ్డి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సంగారెడ్డి నియోజకవర్గంలోని 84 గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో జగ్గారెడ్డి దిశానిర్దేశం చేశారు. ఆయా గ్రామాల్లో రిజర్వేషన్లు, అభ్యర్థుల ఎంపిక గురించి ఆరా తీశారు. ఏ గ్రామ అభ్యర్థిని ఆ గ్రామంలోనే కాంగ్రెస్ కార్యకర్తలు సమన్వయం చేసుకొని ఎంపిక చేయాలని సూచించారు. ఎన్నికల్లో ఏ అవసరం వచ్చినా ఎన్నికల కమిటీ సభ్యులను సంప్రదించాలని పేర్కొన్నారు. కొండాపూర్, సదాశివపేట, కంది, సంగారెడ్డి మండలాల పార్టీ అధ్యక్షులు వారి పరిధిలోని గ్రామాలను పర్యవేక్షిస్తారని వివరించారు.


సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న జగ్గారెడ్డి


బ్లాక్ కాంగ్రెస్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, ముఖ్యనేతలతో కలిసి మాట్లాడుతున్న జగ్గారెడ్డి

మార్కెట్ కమిటీల

పాలకవర్గాలు నియామకం

తొగుట/దుబ్బాక, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక నియోజకవర్గంలోని తొగుట, దుబ్బాక, దౌల్తాబాద్, మిరుదొడ్డి, చేగుంట మార్కెట్ కమిటీ పాలకవర్గాలను నియమిస్తూ సోమవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చెరుకు విజయ్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా కొంగరి నర్సింహులు, దుబ్బాక మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కొంగరి రవి ముదిరాజ్, వైస్ చైర్మన్‌గా బి.బాల్‌రెడ్డి, దౌల్తాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గొల్లపల్లి కనకయ్య యాదవ్, వైస్ చైర్మన్‌గా మద్దెల స్వామి, మిరుదొడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బొమ్మెర సంయుక్త శ్రీధర్ గుప్తా, వైస్ చైర్మన్ భూమయ్యగౌడ్, చేగుంట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తాడెం వెంగళ్‌రావు, వైస్ చైర్మన్‌గా శ్రీనివాస్‌గౌడ్‌ను నియమించారు.


చెరుకు విజయ్‌రెడ్డి (తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్)


కొంగరి రవి (దుబ్బాక మార్కెట్ కమిటీ చైర్మన్)


కనకయ్య యాదవ్ (దౌల్తాబాద్)


సంయుక్త శ్రీధర్‌గుప్తా (మిరుదొడ్డి)


తాడెం వెంగళ్‌రావు (చేగుంట)

పల్లెపోరుకు సై



- గ్రామపంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పోలింగ్
- ఈ నెల 27 నుంచి నామినేషన్ల స్వీకరణ
- జిల్లాలో 508 గ్రామాలు, 4,508 వార్డులు

సిద్దిపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎప్పుడెప్పుడా అంటూ ఎదురుచూసిన పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. మూడు విడతల్లో ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సిద్దిపేట జిల్లాలో 508 గ్రామాలుండగా, 4,508 వార్డులు ఉన్నాయి. తొలివిడతకు సంబంధించి ఈ నెల 27 నుంచే నామినేషన్లు స్వీకరించనున్నారు. మొదటి విడత పోలింగ్ డిసెంబరు 11, రెండోది 14, మూడో విడత పోలింగ్ 17న జరుగనున్నది. అదేరోజు సాయంత్రం కౌంటింగ్ చేపట్టనున్నారు. కొన్ని రోజుల్లో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డుసభ్యులు కొలువుదీరబోతున్నారు.

మండలాల వారీగా ఎన్నికలు ఇలా..

తొలివిడత (163 గ్రామాలు)	రెండో విడత (182 గ్రామాలు)	మూడో విడత (163 గ్రామాలు)
దౌల్తాబాద్	అక్బరుపేట-భూంపల్లి	అక్కన్నపేట
గజ్వేల్	బెజ్జంకి	చేర్యాల
జగదేవ్‌పూర్	చిన్నకోడూరు	ధూళిమిట్ట
మర్కుక్	దుబ్బాక	హుస్నాబాద్
ములుగు	మిరుదొడ్డి	కోహెడ
రాయపోల్	నంగునూరు	కొమురవెల్లి
వర్గల్	నారాయణరావుపేట	కొండపాక
-	సిద్దిపేట రూరల్	కుకునూరుపల్లి
-	సిద్దిపేట అర్బన్	మద్దూరు
-	-	తొగుట

అభ్యర్థులపై కసరత్తు..

ఇప్పటికే రిజర్వేషన్లు ఖరారుకావడం, తాజాగా షెడ్యూల్ రావడంతో ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపిక పనిలో పడ్డాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ఇప్పటికే సగానికి పైగా అభ్యర్థులను ఫైనల్ చేసినట్లుగా తెలుస్తోంది. రేపటి నుంచే తొలి విడత నామినేషన్లు ఉండడంతో ఆ దిశగా అభ్యర్థులను గుర్తిస్తున్నారు.

ఆశీస్సులు ఉండాలంటూ..

నోటిఫికేషన్ రావడంతో ఆశావహులు ఆశీస్సుల కోసం పాకులాడుతున్నారు. గ్రామాల్లోని ముఖ్యులు, కులసంఘాల పెద్దలను కలిసి మద్దతు కోరుతున్నారు. తమ మద్దతు ఉంటేనే బరిలోకి దిగుతామని, లేదంటే విరమించుకుంటామని చెబుతున్నారు. పల్లెల్లో వ్యూహరచన చేసే నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రిజర్వేషన్లు అనుకూలించని నేతల వద్దకు వెళ్లి కాళ్లావేళ్లా పడుతున్నారు. మంచి హస్తవాసి ఉన్నవారంటూ చెబుతూ పదుల సంఖ్యలో వ్యక్తుల వద్ద నామినేషన్ ఫీజులు తీసుకొని తమ వైపు ప్రసన్నం చేసుకుంటున్నారు.


మహిళా సంఘాలకు రుణాల చెక్కు అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

గోడౌన్ల నిర్మాణానికి

భూసేకరణ చేపట్టండి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- కలెక్టర్, రైల్వే అధికారులతో సమావేశం

సిద్దిపేట నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలో రైల్వే శాఖ ద్వారా నిర్మించే గౌడౌన్ల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ చేపట్టాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కలెక్టర్ కే.హైమావతిని కోరారు. మంగళవారం సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్, రైల్వే అధికారులతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ సనత్‌నగర్, చర్లపల్లి రైల్వే స్టేషన్ పరిధిలో ఉండే గోడౌన్ల మాదిరిగా సిద్దిపేట గౌడౌన్లు నిర్మించాలన్నారు. ఇక్కడి నుంచే సనత్‌నగర్, చర్లపల్లి గౌడౌన్లలో ధాన్యాన్ని నిల్వ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో రైల్వే లైన్‌ను ఆనుకొని ఉన్న అనువైన స్థలాన్ని వెంటనే గుర్తించి, పరిశీలించాలని కలెక్టర్ హైమావతి, సిద్దిపేట ఆర్‌డీవో సదానందంను కోరారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు నవ్యశ్రీ, విద్యాధర్, మూర్తి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో సిద్దిపేట నియోజకవర్గంలోని స్వయం సహాయక సంఘం సభ్యులకు వడ్డీలేని రుణాల చెక్కులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు కలెక్టర్ కే.హైమావతితో కలిసి పంపిణీ చేశారు.

మహిళా ఉన్నతికి ప్రభుత్వం కృషి

- కలెక్టర్ కట్టా హైమావతి
- మహిళలకు వడ్డీలేని రుణాలు, సబ్సిడీ యంత్రాల పంపిణీ


మహిళా రైతులకు సబ్సిడీ యంత్రాలను అందచేస్తున్న కలెక్టర్ హైమావతి

గజ్వేల్/ సిద్దిపేట కలెక్టరేట్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళా ఉన్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని కలెక్టర్ కట్టా హైమావతి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఐవోసీలో గజ్వేల్ నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన 3718 స్వయం సహాయక సంఘాలకు రూ.3.99 కోట్ల వడ్డీ లేని రుణాలను పంపిణీ చేశారు. అలాగే కలెక్టరేట్ ఆవరణలో వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా ఎంపిక చేసిన 171 మంది మహిళా రైతులకు కలెక్టర్ సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు, పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డిసెంబరు 2023 నుంచి ఆగస్టు 2024 వరకు రూ.28.97కోట్లు, సెప్టెంబరు 2024 నుంచి సెప్టెంబరు 2025 వరకు రూ.15.59 కోట్ల వడ్డీ లేని రుణాలను అందజేసినట్లు తెలిపారు. 1,99,624 చీరలు, 26,721 కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశామన్నారు. 446.32 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పంపిణీ చేసినట్లు తెలిపారు. జిల్లాలో 11,201 ఇందిరమ్మ ఇళ్లకు 9090 ఇళ్లను మొదలు పెట్టారని, రూ.129.63 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామన్నారు. రూ.22.83 కోట్ల గ్యాస్ సబ్సిడీ అందించామన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద సర్కార్ జిల్లాకు రూ.1.78 కోట్ల నిధులను మంజూరు చేసిందని తెలిపారు. ఆమె వెంట జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపరాణి, ఆర్డీవో వీవీఎల్ చంద్రకళ, అదనపు డీఆర్‌డీవో సుధీర్, జిల్లా మహిళా అధ్యక్షులు రేణుక తదితరులున్నారు.



రిఫర్ తగ్గే..

ప్రసవాలు పెరిగే..

- గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సేవల్లో కొంత మార్పు
- కొన్ని విభాగాలది అదే తీరు
- స్కానింగ్‌లు, కంటి అద్దాలు, పిల్లల వైద్యం ఇంకా ప్రైవేటుకే..

గజ్వేల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ ప్రభుత్వాసుపత్రి వైద్య సేవల్లో కొంత మార్పు వచ్చింది. ఆంధ్ర జ్యోతిలో ప్రచురితమైన వరుస కథనాలతో అటు సిబ్బందిలో... ఇటు వైద్యాధికారుల తీరులో మార్పులు వచ్చాయి. గతం కంటే ప్రసవాల సంఖ్య పెరగడంతో పాటు రిఫర్ చేసే కేసుల సంఖ్య తగ్గినప్పటికీ ఇంకా అక్కడక్కడా లోటుపాట్లు కనిపిస్తున్నాయి. కొందరు వైద్యులు, సిబ్బంది వైఖరిలో మార్పు మాత్రం రాలేదు. కంటి వైద్యం, పిడియాట్రిషియన్, గర్భిణుల స్కానింగ్‌లో మాత్రం ఏలాంటి మార్పు కనిపించడం లేదు. కీలకమైన పిల్లలు, కంటి వైద్యం, గర్భిణుల స్కానింగ్‌లో ఇంకా రిఫర్‌లు కొనసాగుతున్నాయి. ఆసుపత్రిలో ఏసీ రిపేర్లు, ఇతర మరమ్మతుల అంశంలో స్కాం జరిగిందని ఇటీవల మెదక్ ఎంపీ రఘునందన్‌రావు దిశా కమిటీ సమావేశంలోనే ఆసుపత్రి సూపరిండెంట్‌ను నిలదీశారు.

పెరిగిన ప్రసవాలు..

సిద్దిపేట జిల్లా ఆసుపత్రి, మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ప్రసూతీలు పెరగడంతో పాటు రిఫర్ కేసులు గణనీయంగా తగ్గాయి. గతంలో నెలకు 300 దాటాలంటే ఇబ్బందిగా ఉన్న ప్రసూతీల సంఖ్య ఆగస్టులో 355, సెప్టెంబరులో 386, అక్టోబరులో 404 జరుగగా, రిఫర్ కేసులు సంఖ్య ఆగస్టులో 107, సెప్టెంబరులో 100, అక్టోబరులో 70కి చేరింది. ఓపీ సంఖ్యలో తేడా కనిపించకపోయినా ఐపీలో మాత్రం గణనీయంగా మార్పులు ఏర్పడ్డాయి.

స్కానింగ్, కంటి అద్దాలకు బయటికే..

గజ్వేల్ పట్టణంలోని సిద్దిపేట జిల్లా ఆసుపత్రితో పాటు మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ప్రసూతిలు పెరిగి, రిఫర్ కేసులు తగ్గినప్పటికీ కొన్ని విభాగాల్లో మాత్రం మార్పు రావడంలేదు. మాతాశిశు ఆరోగ్య కేంద్రం నుంచి స్కానింగ్, కంటి అద్దాలు, పిల్లల వైద్యం కోసం ఇప్పటికీ బయట ప్రైవేటుకు రిఫర్ చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కంటి వైద్యం సైతం సరిగా అందించడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకరిద్దరు వైద్యులు, సిబ్బంది తీరులోనూ ఏలాంటి మార్పు రాలేదని, ఈ అంశాలపై కలెక్టర్, ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నకోసం తమ్ముడి తాపత్రయం

- హత్య తానే చేశానని పోలీసుల ముందుకు..
- విచారణలో నిజం తేల్చిన పోలీసులు
- ఇద్దరి అరెస్ట్.. రిమాండ్

7లో

చలికి చస్తున్నాం.. ఎప్పుడు ఓపెన్ చేస్తారు..

- రేకుల షెడ్డు పూర్తయినా ప్రారంభించని అధికారులు
- చలికి వణుకుతున్న విద్యార్థులు

7లో

ఇంటర్ యాక్షన్ ప్లాన్ ఆన్..

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు

- 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ
- స్టడీ అవర్స్, అదనపు తరగతులు
- మానసిక ఒత్తిడి తగ్గించేందుకు చర్యలు
- సలహాలు, సూచనలకు టెలిమానస్

సిద్దిపేట కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానుండగా, ఫిబ్రవరి 3 నుంచి ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. మరో రెండు నెలలు మాత్రమే ఉండటంతో ఉత్తమ ఫలితాల సాధననే లక్ష్యంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వివిధ రంగాలకు చెందిన నిపుణుల చేత ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 39 రెసిడెన్షియల్స్, ఇంటర్మీడియట్ ఉన్న కేజీబీవీలు 16, మోడల్ స్కూల్స్ 14 ఉన్నాయి. మొత్తం 20,300 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

90 రోజుల యాక్షన్ ప్లాన్..

మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు ఇంటర్మీడియట్ విద్యాశాఖ ప్రభుత్వ ప్రభుత్వ అనుబంధ కళాశాల విద్యార్థులకోసం ప్రత్యేక కార్యచరణ రూపొందించి నవంబరు 1 నుంచి పలు కళాశాలల్లో అమలు చేస్తున్నారు. నిర్దేశించిన తేదీ వరకు సిలబస్ పూర్తయ్యేలా చూడటంతో పాటు ప్రయోగ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. ఇంగ్లిష్, ప్రాక్టికల్స్ కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. క్రమంతప్పకుండా విద్యార్థుల తలిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నారు. రాబోయే రోజులు కీలకం కాబట్టి హాజరుశాతంపై కూడా ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.



స్టడీ అవర్స్..

కళాశాల ముగిసిన తర్వాత విద్యార్థులకు ప్రతిరోజు 45 నిమిషాల పాటు ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో సబ్జెక్టులు మిగిలిపోయిన, తక్కువ మార్కులు స్కోర్ చేసిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. అసైన్‌మెంట్స్, స్లిప్ టెస్ట్‌లు, ఇంపార్టెంట్ క్వశ్చన్స్‌ను మార్కు చేసి శిక్షణనిస్తూ ఎప్పటికప్పుడు విద్యార్థుల ప్రగతిని సమీక్షిస్తున్నారు.

ఒత్తిడిని తగ్గించేందుకు..

విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి కళాశాలకు ప్రత్యేకంగా హైదరాబాద్ ఎమ్‌సీహెచ్‌ఆర్‌డీలో - మిగతా 8వ పేజీలో...

జిల్లాకు ఇద్దరు కొత్త డిప్యూటీ డీఎంహెచ్‌వోలు

● జహీరాబాద్‌కు డా.లక్ష్మీశైలజ ● 'ఖేడ్'కు డా.శ్రీనివాసరావు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న పలువురు సివిల్ అసిస్టెంట్ సర్జన్(సీఏఎస్)లకు డిప్యూటీ సివిల్ సర్జన్లుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డా.రవీందర్ నాయక్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. జహీరాబాద్(కోహీర్) డిప్యూటీ డీఎంహెచ్‌వోగా డా.ఎ.లక్ష్మీశైలజ, నారాయణఖేడ్ డిప్యూటీ డీఎంహెచ్‌వోగా డా.పి.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఆర్సీపురం మెడికల్ ఆఫీసర్(ఎన్‌సీడీ, ఎయిడ్స్ అండ్ లెప్రసీ-పీవో) డా.మహేందర్‌రెడ్డి పదోన్నతిపై సిద్దిపేట డిప్యూటీ డీఎంహెచ్‌వోగా నియమితులయ్యారు. మనూర్ మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పి.నర్సింగ్‌చౌహాన్ ఎల్లారెడ్డి డిప్యూటీ డీఎంహెచ్‌వోగా నియమితులయ్యారు. బొల్లారం మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న నిర్మలరెడ్డి పదోన్నతిపై సిద్దిపేట డీఎంహెచ్‌వో కార్యాలయానికి ప్రోగ్రాం ఆఫీసర్‌గా నియమితులయ్యారు. సంగారెడ్డి జీజీహెచ్‌లో పనిచేస్తున్న డా.కె.సంజయ్ గద్వాల జీజీహెచ్‌కు, అదే విధంగా డా.కపూర్ ములుగు జీజీహెచ్‌కు పదోన్నతిపై నియమితులయ్యారు.

ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వద్దు

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలులో కేంద్రాల నిర్వాహకులు నిర్లక్ష్యం చేయొద్దని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్ మార్కెట్ యార్డులోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రిజిస్టర్లను సరిగా నిర్వహిస్తున్నారా లేదా అని తనిఖీ చేసి మాట్లాడారు. కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తేమ శాతం రాగానే కొనుగోలు చేయాలని వెంటనే ట్యాగ్ చేసిన మిల్లులకు తరలించాలన్నారు. అనంతరం లింగాపూర్‌లోని పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని, పరిశీలించారు. అలాగే నర్సాపూర్ మార్కెట్‌యార్డులోని ఇసుక బజార్‌ను కూడా సందర్శించి, తనిఖీ చశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహిపాల్, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.


నర్సాపూర్‌లోని మార్కెట్‌యార్డులో కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. నర్సాపూర్ మండలం లింగాపూర్ లోని రైతువేదికలో వడ్డీ లేని రుణాల చెక్కులను మహిళా సంఘాల సభ్యులకు స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహిపాల్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మధులత, ఏపీవో సంగమేశ్వర్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా పాల్గొన్నారు.

ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు జరగాలి

● నెలవారీ నేర సమీక్షలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి త్వరితగతిన పూర్తిచేసి, బాధితులకు న్యాయం చేయాలని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పోలీసుల అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షలో నేరాల పరిస్థితి, పెండింగ్ కేసుల పరిణామాలు, విచారణలో ఉన్న కేసుల పురోగతి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులు ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలన్నారు. ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులు పెండింగ్‌లో ఉన్న కేసులను తక్షణమే పూర్తి చేయాలన్నారు. అనంతరం స్పెషల్ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ఆయన ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సమీక్షలో అదనపు ఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు ప్రసన్నకుమార్, నరేందర్‌గౌడ్, సీఐలు, ఎస్ఐలు, అధికారులు పాల్గొన్నారు.

కంకర ట్రాక్టర్ బోల్తా, డ్రైవర్ మృతి


వడ్డెర రాజు (ఫైల్)

రామాయంపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కంకర మిషన్ నుంచి లోడ్ చేసుకుని వస్తున్న ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన రామాయంపేట మున్సిపల్ పరిధి కోమటిపల్లి శివారులో మంగళవారం విషాదాన్ని నింపింది. కోమటిపల్లి వడ్డెర కాలనీకి చెందిన రాజు (అలియాస్) గోపి(30) కంకర ట్రాక్టర్‌ను నడుపుతున్నాడు. కంకర లోడ్ చేసుకుని వస్తున్న క్రమంలో రోడ్డు గుంతలుగా ఉండడంతో ఒక్కసారిగా ఒరిగి పడిపోయింది. ఈ ఘటనలో రాజు ట్రాలీ కింద నలిగి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు. మృతునికి భార్య భవాని, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తల్లి మందలించిందని యువకుడు ఆత్మహత్య


మఠం జశ్వంత్ (ఫైల్)

చేగుంట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తల్లి మందలించిందని మనస్తాపానికి గురై యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. చేగుంట మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన మట్టం స్వప్న, నర్సింలకు కూతురు, కుమారుడు ఉన్నారు. ఇటీవలే కూతురు వివాహం చేశారు. కుమారుడు జశ్వంత్(18) ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. ఎలాంటి పనిచేయకుండా ఇంట్లో ఖాళీగా ఉండడంతో తల్లి పనిచేసుకోవాలని మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన జశ్వంత్ మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఉద్యోగం పోయిందని..


ప్రవీణ్(ఫైల్)

కౌడిపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగం పోయిందని మనోవేదనతో ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. కౌడిపల్లి మండల కేంద్రానికి చెందిన చంద్రం ప్రవీణ్‌గౌడ్(39) కొంతకాలంగా ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం డ్రైవర్ పనికి వెళ్లగా ఉద్యోగం లేదని చెప్పారు. తిరిగి ఇంటికొచ్చి భోజనం చేస్తూ ఉద్యోగం పోయిందని మనోవేదన చెందాడు. కాగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కౌడిపల్లి ఎస్ఐ మురళి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో యువకుడు..


ఉమామహేశ్వర్ మృతదేహం

పాపన్నపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా మనస్తాపానికి గురై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి వివరాల ప్రకారం.. పాపన్నపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన గడ్డమీది ఉమామహేశ్వర్(23) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య దీపికతో కొన్నిరోజులుగా సంసార విషయంలో గొడవలు జరుగుతున్నాయి. సోమవారం మధ్యాహ్నం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అనంతరం ఇంట్లోంచి వెళ్లిన ఉమామహేశ్వర్ తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం గ్రామంలోని ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. గ్రామస్థుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి వెంకటేశం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

వెల్దుర్తి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పాడిగేదె మృతిచెందింది. వెల్దుర్తి మండలం శేరి గ్రామానికి చెందిన బండ యాదగిరికి చెందిన పాడిగేదెను రోజులాగే మేత కోసం గ్రామ శివారుకు తోలుకెళ్లాడు. మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు అక్కడికక్కడే మృతిచెందినట్లు బాధితుడు తెలిపాడు. గేదె విలువ రూ.80 వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని యాదగిరి కోరాడు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

వెల్దుర్తి/జహీరాబాద్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. వెల్దుర్తి మండల పరిధి మన్నెవారి జలాల్‌పూర్‌కు చెందిన కమ్మరి రుక్కమ్మ, పాండరి ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. చుట్టుపక్కలవారు గమనించి మంటలు ఆర్పినా అప్పటికే బియ్యం, బట్టలు, వంట సామగ్రి, టీవీ దగ్ధమయ్యాయి. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. ఆర్ఐ నర్సింగ్‌యాదవ్ ఘటనా స్థలానికి చేరుకోని పంచనామా నిర్వహించారు. అలాగే జహీరాబాద్‌లోని పాత ఆర్టీఏ చెక్ పోస్ట్ వద్ద సోమవారం సాయంత్రం బస్సులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయని రావూస్ పాఠశాల సీఈవో నిధిన్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అనంతరం పిల్లలను కాపాడిన డ్రైవర్‌ను సన్మానించారు.







మునిపల్లి మండలంలోని లింగంపల్లి గురుకుల పాఠశాల, పూర్తయిన తాత్కాలిక రేకులషెడ్డు నిర్మాణం, చెట్ల కింద భోజనాలు చేస్తున్న విద్యార్థులు

చలికి చస్తున్నాం.. ఎప్పుడు ఓపెన్ చేస్తరు..

● రేకుల షెడ్డు పూర్తయినా ప్రారంభించని అధికారులు
● చలికి వణుకుతున్న విద్యార్థులు

మునిపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చలికి చస్తున్నాం.. తాత్కాలిక రేకుల షెడ్లు ఎప్పుడు ఓపెన్ చేస్తారని విద్యార్థులు వాపోతున్నారు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం పరిధిలోని లింగంపల్లి గురుకుల సొసైటీ వసతి భవనం సెప్టెంబరు 9న కూలిన విషయం తెలిసిందే. మంత్రి దామోదర్ రాజనర్సింహ, కలెక్టర్ ప్రావీణ్య, డీఈవో వెంకటేశ్వర్లు, గురుకులాలకు సంబంధించిన అధికారులు సందర్శించారు. విద్యార్థులు బస చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కానీ ఆ దిశగా అడుగులు పడలేదు. ఈ విషయమై సెప్టెంబరు 24న 'విద్యార్థుల వసతి ఎక్కడ..?' అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు గతంలో ఎల్అండ్‌టీ సహకారంతో నిర్మించిన స్కూల్ బిల్డింగ్‌పై తాత్కాలిక షెడ్డు నిర్మాణ పనులను సెప్టెంబరు 24న ప్రారంభించారు. వారంరోజుల క్రితం పనులు పూర్తయినా షెడ్డు ఓపెన్ చేయలేదు. దీంతో పాఠశాల పాత భవనంపై ఉన్న రేకుల షెడ్డులో బస చేస్తున్న విద్యార్థులు చలికి వణుకుతున్నారు. అధికారులు స్పందించి తాత్కాలిక రేకుల షెడ్లను వెంటనే ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

'షీక్యాబ్'తో గిరిజన మహిళకు ఉపాధి

● జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్



జహీరాబాద్‌లో గిరిజన మహిళ లక్ష్మీబాయికి వాహన తాళాన్ని అందజేస్తున్న జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్

జహీరాబాద్/సంగారెడ్డి అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : 'షీక్యాబ్'తో గిరిజన మహిళకు స్వయం ఉపాధి పొందే అవకాశాలు ఉంటాయని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్ తెలిపారు. జహీరాబాద్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో జహీరాబాద్‌కు చెందిన లబ్ధిదారు లక్ష్మీబాయికి డ్రైవర్ కమ్ ఓనర్ పథకం కింద (యూనిట్ కాస్ట్ రూ.9 లక్షలు) మంజూరైన కారు వాహనాన్ని ఎంపీ మంగళవారం అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్నివర్గాల మహిళలకు పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీటీడీవో వెంకటేశం, నీలిమ, బ్యాంచ్ మేనేజర్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నల్లవాగు ప్రాజెక్టు నీటిని ఎక్కడికీ తరలించం

● యాసంగి పంటలకే ప్రాజెక్టు నీరు
● రైతులు అపోహలు నమ్మొద్దు : ఎమ్మెల్యే



సంజీవరెడ్డి

కల్హేర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టు నీటిని యాసంగిలో పూర్తిస్థాయిలో ఆయకట్టు పరిధిలోని కల్హేర్, సిర్గాపూర్ మండలాల పరిధిలోని గ్రామాల భూములకే సరఫరా చేస్తామని, ఇందులో రైతులు అపోహలకు గురికావద్దని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న మంచిపేరును చూసి ఓర్వలేని వారు నల్లవాగు ప్రాజెక్టు ఆయకట్టు రైతులను అపోహలకు గురిచేస్తూ లేని పోనీ అనుమాలకు గురిచేస్తున్నారన్నారు. ప్రాజెక్టు నీటిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నవారి పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆయన సచించారు. నల్లవాగు ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని కల్హేర్, సిర్గాపూర్ మండలాల పరిధిలోని గ్రామాల రైతులతో పాటు ఎడమకాలువ పరిధిలోని కామారెడ్డి జిల్లా పిట్లం మండలం మార్‌దండ, తిమ్మానగర్ గ్రామాలకు చెందిన రైతులతో నల్లవాగు ప్రాజెక్టు వద్ద సమావేశం నిర్వహిస్తామన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు దూళిమిట్ట విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మద్దూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా స్థాయిలో నిర్వహించిన సాఫ్ట్ బాల్ ఎంపికల్లో దూళిమిట్ట ఉన్నత పాఠశాల విద్యార్థులు సందీప్, వశీకర్, ఓంకార్, యోగి అద్భుత ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయి సీనియర్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 28 నుంచి 30 వరకు ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనందున విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు కర్ణాకర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు సతీష్‌కుమార్‌తో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రజాబాట

తూప్రాన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా చేపట్టేందుకు ప్రజాబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విద్యుత్‌శాఖ రూరల్ (ఉమ్మడి మెదక్, రంగారెడ్డి జిల్లా) చీఫ్ ఇంజనీర్ బాలస్వామి పేర్కొన్నారు. మంగళవారం తూప్రాన్ పట్టణంలో ప్రజాబాటను ఎస్ఈ నారాయణనాయక్‌తో కలిసి పరిశీలించారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా జరిగేందుకు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు పరిశీలించి బాగుచేస్తున్నట్లు వివరించారు. ఇందులో తూప్రాన్ విద్యుత్ డీఈ గరత్మంత్‌రాజ్, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కంటైనర్‌లో గోవుల తరలింపు

● సిద్దిపేట నుంచి వెంటాడిన గోరక్షణ కమిటీ
● నర్సాపూర్‌లో పట్టుకుని పోలీసులకు అప్పగింత
● కంటైనర్‌లో కుక్కినట్లు 60 ఆవులు



ఆందోళనకు దిగిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ తదితరులు

నర్సాపూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కంటైనర్‌లో ఎవరికీ అనుమానం రాకుండా గోవులను తరలిస్తుండగా, సమాచారం అందుకున్న గోరక్షణ కమిటీ ప్రతినిధులు సిద్దిపేట నుంచి వాహనాన్ని వెంబడించి పట్టుకున్నారు. సుమారు 60 గోవులను కంటైనర్‌లో కుక్కి తీసుకువెళ్తుండగా పట్టుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు.. సిద్దిపేట వైపు నుంచి ఓ కంటైనర్ వాహనంలో సుమారు 60 వరకు గోవులను అక్రమంగా తరలిస్తున్నట్లు తెలుసుకున్న గోరక్షణ కమిటీ ప్రతినిధులు అక్కడి నుంచే వాహనాన్ని వెంబడించారు. అయితే, కంటైనర్‌లోని వ్యక్తులు వారికి దొరకకుండా వేగంగా వాహనం నడుపుతూ ముందుకు సాగారు. ఈ క్రమంలో కంటైనర్ మెదక్ జిల్లా నర్సాపూర్‌కు వచ్చింది. నర్సాపూర్ చౌరస్తాలో సిగ్నల్ పడటంతో గోవులు ఉన్న కంటైనర్ ఆగింది. ఈ క్రమంలో గోరక్షణ కమిటీ ప్రతినిధులు కంటైనర్‌ను పట్టుకునేందుకు వెళ్లగా, తప్పించుకునేందుకు ప్రయత్నించారు. స్థానికులతో కలిసి గోరక్షణ కమిటీ సభ్యులు ఎట్టకేలకు కంటెనర్‌ను పట్టుకున్నారు. కంటైనర్ తెరిచి చూడగా, అనుమానించినట్లే అందులో సుమారు 60 వరకు గోవులు కిక్కిరిన స్థితిలో ఉండగా, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి సిబ్బందితో వచ్చి కంటైనర్‌ను స్థానిక జూనియర్ కళాశాల మైదానికి తరలించారు. విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు వి.మల్లేశ్‌గౌడ్‌తో పాటు స్థానిక బీజేపీ నాయకులు కూడా పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని గోవులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో ఎస్ఐ వారికి నచ్చచెప్పి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఇచ్చారు. గోవులను గోశాలకు తరలించి సంరక్షిస్తామని చెప్పారు. గోవులు తరలిస్తున్న విషయమై పూర్తి విచారణ జరిపి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హామీ ఇవ్వడంతో గోరక్షణ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.



నర్సాపూర్‌లో పట్టుకున్న గోవులతో ఉన్న కంటైనర్

అన్నకోసం తమ్ముడి తాపత్రయం

● హత్య తానే చేశానని పోలీసుల ముందుకు..
● విచారణలో నిజం తేల్చిన పోలీసులు ● ఇద్దరి అరెస్ట్.. రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్ఐ

కుకునూరుపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): భార్యతో సన్నిహితంగా ఉంటున్నాడని సొంత మేనల్లుడిని ఓ మేనమామ కారుతో ఢీ కొట్టి హత్య చేశాడు. అయితే, ఆ హత్య కేసును తన మీద వేసుకుని నిందితుడి తమ్ముడు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. విచారణలో అన్నే హత్య చేశాడని నిర్ధారించిన పోలీసులు నిందితుడితోపాటు తమను తప్పుదారి పట్టించిన సోదరుడినీ అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను తొగుట సీఐ లతీఫ్, కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్‌లు వెల్లడించారు. వారి కథనం మేరకు.. సిద్దిపేట జిల్లా చాట్లపల్లికి చెందిన ఖదీర్ నాలుగేళ్ల క్రితం భువనగిరికి చెందిన తన మేనల్లుడు షాహీద్‌ను తీసుకువచ్చి తన వద్దే ఉంచుకుని, పనులు చేయించుకునేవాడు. ఈ క్రమంలో తన భార్యతో షాహీద్ ఫోన్‌లో మాట్లాడుతూ సన్నిహితంగా ఉంటున్నాడని ఖదీర్ అనుమానించాడు. తన సోదరి అయిన షాహీద్ తల్లికి విషయం చెప్పి హెచ్చరించినా అతనిలో మార్పు రాలేదు. గత శనివారం షాహీద్.. ఖదీర్ భార్యను కలిశాడు. ఈ విషయం తెలిసి ఖదీర్ మేనల్లుడిని ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నాడు. అదే క్రమంలో షాహీద్ బైక్‌పై వెళ్తున్నాడని తెలుసుకున్నాడు. షాహీద్ బైక్‌పై మండలంలోని చిన్నకిష్టాపూర్ గ్రామ శివారులోకి రాగా, అప్పటికే అతనిని వెంబడిస్తున్న ఖదీర్ తన కారుతో బైక్‌ను బలంగా ఢీ కొట్టాడు. షాహీద్‌కు తీవ్రంగా గాయాలు కాగా, చనిపోలేదని భావించి మరోమారు కారుతో బలంగా ఢీకొట్టాడు. మేనల్లుడు మరణించాడని నిర్ధారించుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. కేసు నమోదు చేసుకున్న కుకునూరుపల్లి పోలీసులు నిందితుడి కోసం రెండు బృందాలను ఏర్పాటుచేసి గాలిస్తుండగా, ఖదీర్ తమ్ముడు మహ్మద్ షబ్బీర్ తానే హత్య చేసినట్లు పోలీసుల వద్దకు వచ్చి చెప్పాడు. అయితే, సీసీ కెమెరాలు పరిశీలించిన పోలీసులు షబ్బీర్ హత్య చేయలేదని, అతని అన్న ఈ హత్య చేసినట్లు నిర్ధారించారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించగా, అన్నకు ప్రభుత్వ ఉద్యోగం ఉన్నందున కేసు కావద్దనే ఉద్దేశంతో ఈ హత్య కేసును తన మీద వేసుకున్నట్లు షబ్బీర్ ఒప్పుకున్నాడు. దీంతో నిందితుడు ఖదీర్‌తో పాటు పోలీసులను తప్పుదోవ పట్టించిన షబ్బీర్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు



నిర్మల్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఈ కవిత స్రవంతి

జగదేవ్‌పూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అర్హులైన ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉందని హౌజింగ్‌శాఖ డీఈ కవిత స్రవంతి అన్నారు. మంగళవారం జగదేవ్‌పూర్ మండలం నిర్మల్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను, ఇంటి నిర్మాణ పనులు పూర్తయిన లబ్ధిదారులతో మాట్లాడి బిల్లుల విడుదల, పనుల పురోగతి, నిర్మాణంలో ఎదురయ్యే సమస్యల గురించి వివరాలు సేకరించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు ఆలస్యం చేయకుండా పనులు త్వరగా పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. ఇంటి నిర్మాణ పనుల్లో సాంకేతిక సమస్యలు, బిల్లుల విషయంలో ఇబ్బందులు ఉంటే వెంటనే సమాచారం అందించాలని అధికారులకు సూచించారు. నిర్మాణ పనులు పూర్తయిన లబ్ధిదారులకు బిల్లులు అందని పక్షంలో సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి తక్షణమే పరిష్కారమయ్యేలా చూడాలని మండల అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాంరెడ్డి, హౌజింగ్ ఏఈ విశాఖ, ఎంపీవో కాజా మొయినొద్దీన్, అల్లిరాజపేట్ మాజీ సర్పంచ్ లక్ష్మీచంద్రశేఖర్‌రెడ్డి, నిర్మల్‌నగర్ మాజీ ఉపసర్పంచ్ పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

'ఉల్లాస్'ను విజయవంతం చేయండి

● వయోజన విద్య ఉమ్మడి మెదక్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి



మహిళలకు పంపిణీ చేసిన 'అమ్మకు అక్షరమాల' పుస్తకాలతో వెంకట్‌రెడ్డి

కల్హేర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అక్షరాలు రాని మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమం ద్వారా పొదుపు సంఘాల మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఉమ్మడి మెదక్ జిల్లా వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ కే.వెంకట్‌రెడ్డి కోరారు. మంగళవారం కల్హేర్‌లోని స్త్రీశక్తి భవనంలో ఉల్లాస్ కార్యక్రమ నిర్వహణ సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళల్లో అధిక శాతం నిరక్షరాస్యులు ఉన్నారని, వీరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దే బాధ్యత చదువు వచ్చిన సభ్యులదేనని వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరాక్రాంతి పథం సిబ్బంది శోభన్, సమాఖ్య మండల ప్రధాన కార్యదర్శి రేణుక, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

బిస్లరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

● పరిశ్రమ ఎదుట మోకాళ్లపై నిల్చొని నిరసన



బిస్లరీ ఇంటర్నేషనల్ పరిశ్రమ ఎదుట మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న కార్మికులు

పటాన్‌చెరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బిస్లరీ ఇంటర్నేషనల్ పరిశ్రమలో చట్టబద్ధంగా యూనియన్ ఏర్పాటు చేసుకున్న కార్మికులను తొలగిస్తుంటే కార్మికశాఖ యాజమాన్యంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని పాశమైలారం ఇండస్ట్రియల్ క్లస్టర్ (సీఐటీయూ) కన్వీనర్, బిస్లరీ యూనియన్ అధ్యక్షుడు అతిమేల మాణిక్ ప్రశ్నించారు. మంగళవారం ఐడీఏ పాశమైలారంలోని బిస్లరీ ఇంటర్నేషనల్ పరిశ్రమ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మోకాళ్లపై కూర్చొని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రేడ్ యూనియన్ చట్టం ప్రకారం కార్మికులు యూనియన్ ఏర్పాటు చేసుకున్నారని, దీంతో యాజమాన్యం కక్షసాధింపు చర్యలతో ఐదుగురిని చట్టానికి విరుద్ధంగా తొలగించిందన్నారు. చట్టాన్ని ఉల్లంఘించిన బిస్లరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో క్లస్టర్ సీఐటీయూ నాయకుడు రాజు, యూనియన్ జనరల్ సెక్రటరీ శేఖర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, కోశాధికారి నవీన్, జాయింట్ సెక్రటరీ అజయ్, కమిటీ సభ్యుడు రాము పాల్గొన్నారు.

చలికాలంలో విక్రయానికి తాటి ముంజలు



ఖేడ్‌లో విక్రయానికి వచ్చిన తాటి ముంజలు

నారాయణఖేడ్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తాటి ముంజలు సహజంగా వేసవికాలం ప్రారంభం నుంచి లభిస్తాయి. ప్రస్తుతం గజగజ వణికించే చలికాలంలో ముంజలు విక్రయించేందుకు రావడంతో జనాలు కొనుగోలు చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ సంతలో మంగళవారం కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం మల్లూర్‌కు చెందిన తుకారం,గణేష్ ముంజలను విక్రయానికి తీసుకొచ్చారు. సీజన్‌లో అమ్మిన ధరలకే ప్రస్తుతం కూడా వందకు డజను చొప్పున విక్రయించారు. ఈ విషయమై విక్రయానికి వచ్చిన తుకారం, గణేష్‌లను ప్రశ్నించగా, కాత ఇప్పుడిప్పుడే ప్రారంభమైందని, అందువల్ల విక్రయించడానికి తీసుకువచ్చామని తెలిపారు.

దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు




నిందితులను చూపుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

రామాయంపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఎనిమిది చోట్ల దొంగతనాలకు పాల్పడ్డ ఆరుగురు నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు మెదక్ ఎస్పీ డివి.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం మెదక్ ఎస్పీ కార్యాలయంలో నిందితుల వివరాలను వెల్లడించారు. ఈనెల 18న రామాయంపేట మండల పరిధి ధర్మారం రైస్‌మిల్లులో సదరు ముఠా రైస్ మిల్లు తాళాలు పగులగొట్టి వస్తువులు ఎత్తుకెళ్లారు. దౌల్తాబాద్ చౌరస్తాలో తనిఖీ నిర్వహిస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా వెళ్తున్న వీరిని పట్టుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. ధర్మారం, చేగుంట, మెదక్, తూప్రాన్, మనోహరాబాద్, శివంపేట, గౌరారం ప్రాంతాల్లో చోరీలు చేసినట్లు అంగీకరించారు. నిందితుల నుంచి టాటా ఏస్ వాహనం, కటింగ్ మిషన్లు, ఇనుప రాడ్లు, రెండు కేజీల కాపర్ వైర్లు, ఆరు ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు.

సౌదీలో ట్రక్ బోల్తా..

● మెదక్ యువకుడు మృతి



నంగి వెంకట్(ఫైల్)

మెదక్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పొట్ట చేత పట్టుకుని ఎడారి దేశం వెళ్లిన మెదక్‌కు చెందిన ఓ యువకుడు అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. మెదక్‌కు చెందిన నంగి వెంకట్(35) స్థానికంగా డ్రైవింగ్ చేస్తూ జీవనం కొనసాగించేవాడు. మరింత ఉన్నతంగా బతికేందుకు ఏడాది క్రితం సౌదీ అరేబియాకు వెళ్లాడు. అక్కడే ట్రక్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి ట్రక్ నడుపుతుండగా, సౌదీలోని జుబేదాలీ పట్టణం సమీపంలో ట్రక్ టైర్ పగిలి వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. డ్రైవర్ సీటులో ఉన్న వెంకట్ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం మెదక్ పట్టణంలోని నవాబుపేట వీధిలో నివాసం ఉంటున్న వెంకట్ భార్య ఎల్లమ్మకు సౌదీలోని కంపెనీ యాజమాన్యం సమాచారం అందించింది. వెంకట్ మృతి చెందిన విషయం తెలుసుకున్న వార్డు మాజీ కౌన్సిలర్ ముత్యంగౌడ్.. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంటనే స్పందించి వెంకట్ పనిచేస్తున్న కంపెనీ యజమానితో ఫోన్‌లో మాట్లాడారు. మృతదేహాన్ని త్వరగా పంపించే ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. మృతుడు వెంకట్‌కు భార్య ఎల్లమ్మతో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

అట్టహాసంగా 'కార్నివల్'

● హాజరైన ఆర్‌సీవో రాజేశం



కార్నివల్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌సీవో రాజేశం

సంగారెడ్డి అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మంజీరానగర్‌లోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో జిల్లాస్థాయి విద్యా సంబంధమైన(లిటరరీ), కల్చరల్ కార్నివల్ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీసీ గురుకుల పాఠశాలల నుంచి విచ్చేసిన విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, డిబేట్, మిమిక్రీ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మెదక్ రీజినల్ కో ఆర్డినేటర్(ఆర్‌సీవో) రాజేశం మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో కార్నివల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ధన్‌రాజ్, సంతోషి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వడ్డీలేని రుణాల పరిమితి పెంచాలి

చేర్యాల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమం కోసం పాటుపడుతున్నామని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల పరిమితి పెంచాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, ధూళిమిట్ట మండలాలకు చెందిన మహిళా స్వయంసహాయక సంఘాలకు రూ.1.55కోట్లమేర వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమం మంగళవారం చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలోని రైతువేదికలో నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ హైమావతి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. పల్లారాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళాభ్యున్నతికి గత బీఆర్ఎస్ సర్కార్ పెద్ద పీటవేసి వడ్డీ లేని రుణ పంపిణీ పథకం అమలు చేసిందన్నారు. అదేకోవలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగించడం అభినందించదగిందన్నారు. మహిళాభివృద్ధికి దోహదపడే పథకాలేవైనా అమలుపరచాల్సిందేనన్నారు.

రూ.20లక్షల రుణం తీసుకున్న మహిళలకు కేవలం రూ.5లక్షలకే వడ్డీలేని రుణం వర్తించడం సబబుకాదని, మహిళాప్రయోజనాల దృష్ట్యా పరిమితి పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడుతుందని, వడ్డీలేని రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహాలక్ష్ములే కదిలి మద్యం బెల్టు తీయాలి

దుబ్బాక, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): సంసారాలు గుల్లచేసే, మద్యం మహమ్మారిని గ్రామాల్లో పారించి, వచ్చిన డబ్బులతోనే వడ్డీలేని రుణాలను పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు చూస్తుందని, గ్రామంలో బెల్ట్‌దుకాణాల మద్యం వ్యాపారాల బెల్ట్ తీయాల్సిన బాధ్యత మహాలక్ష్ములదేనని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం దుబ్బాకలోని ఐవోసీ భవనంలో జరిగిన జరిగిన వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమావతి, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి పాల్గొని ఆయన మాట్లాడారు. మద్యాన్ని గ్రామాలల్లో పారించి, వాటిద్వారా వచ్చే డబ్బులతో 6గ్యారంటీలను అమలు చేస్తామని సర్కారు నిసిగ్గుగా వ్యవహరిస్తుందన్నారు. మహిళలను మహాలక్ష్మిలను చేస్తామన్న రేవంత్ సర్కార్ మహాలక్ష్మి పథకం ఎందుకు అమలు చేయడం లేదని, 18 ఏళ్లు నిండిన మహిళలకు రూ. 2500 ఏమయ్యాయని, కల్యాణ లక్ష్మిలో తులం బంగారం ఏమయిందని ఆయన ప్రశ్నించారు.. కలెక్టర్ హైమవతి మాట్లాడారు. మహిళలు వడ్డీలేని రుణాలను సక్రమంగా వినియోగించుకుని, ఆర్థికస్వాలంభన సాధించాలన్నారు. ఈకార్యక్రమంలో నియోజక వర్గంలోని వివిధ మండలాల మండలపరిషత్ అధికారులు, బీఆర్ఎస్ పార్టీనాయకులు, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



దుబ్బాకలో వడ్డీలేని రుణాలను అందిస్తున్న జిల్లా కలెక్టర్ హైమవతి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి

ప్రీమెట్రిక్ స్కాలర్‌షిఫ్‌లకు దరఖాస్తు చేసుకోవాలి

సిద్దిపేట కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యా సంస్థల్లో 5 నుంచి 10వ తరగతి చదివే బీసీ, ఎస్సీ విద్యార్థులకు అలాగే ప్రైవేట్ పాఠశాలలో 9, 10 తరగతి చదివే బీసీ, ఎస్సీ విద్యార్థులకు ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్ ప్రభుత్వం అందిస్తుందని కలెక్టర్ హైమావతి తెలిపారు. బీసీ, ఎస్సీ విద్యార్థుల ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులపై జిల్లా కలెక్టరేట్‌లో ఏంఈవోలు, ఆయా హాస్టల్ వెల్ఫేర్ అధికారులతో జిల్లా కలెక్టర్ కె. హైమావతి సమీక్ష నిర్వహించారు.. కలెక్టర్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి బీసీ, ఎస్సీ విద్యార్థికి ఈ స్కాలర్‌షిప్ అందేవిధంగా దరఖాస్తులు సమర్పించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులను పూర్తి స్థాయిలో వెంటనే డిసెంబరు 31 లోగా సమర్పించాలన్నారు.

భర్త ఇంటి ముందు భార్య నిరసన

- తనను పిల్లలను వదిలేసి వేరే మహిళతో ఉంటున్నాడని ఆరోపణ
- న్యాయం చేయాలంటూ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు

సిద్దిపేట క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న భర్త తనను, తన పిల్లలను ఇంట్లో నుంచి గెంటేశాడని ఓ మహిళ వాపోయింది. తనకు న్యాయం చేయాలని కోరుతూ నారాయణరావుపేట మండల కేంద్రానికి చెందిన బాల్ లక్ష్మి తన పిల్లలతో కలిసి భర్త ఇంటి ముందు నిరసనకు దిగింది. ఆమె మాట్లాడుతూ నారాయణరావుపేటకు చెందిన భూంరాజుతో 2005లో పెద్దల సమక్షంలో వివాహం జరిగిందని, తమకు 18 ఏళ్ల కుమారుడు, 16 ఏళ్ల కుమార్తె ఉన్నారని తెలిపింది. కొద్ది కాలం క్రితం తన భర్త తమ ఇంటి సమీపంలోని మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని, నిత్యం తనను, పిల్లలను తిడుతూ, కొడుతూ చివరికి ఇంట్లో నుంచి గెంటేసాడని తెలిపింది. పలుమార్లు పెద్దల సమక్షంలో మాట్లాడినప్పటికీ అతడి తీరు మార్చుకోవడం లేదని వాపోయింది. అనంతరం తన భర్త పై చర్యలు తీసుకుని, న్యాయం చేయాలని కోరుతూ రూరల్ పోలీస్ స్టేషన్లో భర్త రాజు పై ఫిర్యాదు చేసింది.

గుడి, బడుల సమీపంలో వైన్స్‌లు ఉండకూడదు

సిద్దిపేట క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గుడి, బడి సమీపంలో వైన్స్‌లకు అనుమతి ఇవ్వకూడదని బీజేపీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్ అన్నారు. మంగళవారం ఆయన నూతన మద్యం దుకాణాలు నిబంధనల మేరకు నిర్వహించాలని సిద్దిపేట బీజేపీ నాయకులతో కలిసి ఎక్సైజ్ సీఐకి మెమోరెండం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తాలో బాలంజనేయ స్వామి దేవాలయం వద్ద ప్రతి ఏటా దసరా వేడుకలు ఘనంగా జరుగుతాయని, అక్కడ వైన్స్ లు ఏర్పాటు చేస్తే భక్తులకు ఇబ్బంది జరుగుతుందన్నారు. గుడి, బడి ,మహనీయుల విగ్రహాల వద్ద విద్యార్థులకు, మహిళలకు ఇబ్బంది కలిగే ప్రదేశంలో వైన్సులు నెలకొల్పితే భారతీయ జనత పార్టీ తరుపున పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు,ఆందోళనలు, ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ప్రజలకు ఇబ్బంది కలిగే చోట..

- సీపీని కోరిన గజ్వేల్ బీజేపీ నాయకులు

గజ్వేల్: ప్రజలకు ఇబ్బంది కలిగే చోట వైన్స్‌లను ఏర్పాటు చేయవద్దని గజ్వేల్ బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ ఎస్ఎం విజయ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

బ్యాటరీల దొంగతనం కేసులో ముగ్గురు అరెస్ట్

- 1.85లక్షల నగదు, 25 బ్యాటరీలు స్వాధీనం

గజ్వేల్ రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో జరిగిన దొంగతనం కేసును గజ్వేల్ పోలీసులు ఛేదించారు. ఈ-వెహికల్ గోడౌన్ నుంచి బ్యాటరీలను దొంగిలించిన ప్రధాన నిందితుడితో పాటు, ఆ చోరీ సొత్తును కొనుగోలు చేసిన మరో ఇద్దరిని అరెస్టు చేసినట్లు గజ్వేల్ ఏసీపీ నర్సింహులు మంగళవారం వెల్లడించారు. ఘటన వివరాలు.. ప్రజ్ఞాపూర్‌లోని కార్తికేయ ఇ-వెహికల్స్ గోడౌన్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న దుర్గం విక్రమ్ గౌడ్ (పెద్ద ఆరెపల్లి) గోడౌన్ నుంచి బ్యాటరీలను దొంగిలించి, తక్కువ ధరలకు విక్రయించాడు. యజమాని మహిపాల్ ఫిర్యాదు మేరకు గజ్వేల్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏసీపీ నర్సింహులు పర్యవేక్షణలో, ఇన్‌స్పెక్టర్ వి. రవికుమార్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ చెట్టుకింది ముత్యం రాజు నేతృత్వంలోని బృందం నిందితులను అరెస్టు చేసింది. ప్రధాన నిందితుడు విక్రమ్ గౌడ్ వద్ద నుంచి రూ.85000 స్వాధీనం చేసుకున్నారు. చోరీ సొత్తు కొనుగోలు చేసిన ఘనపురం వెంకటేశం, మెకానిక్ కుక్కల శేషులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 5 బ్యాటరీ సెట్లు (25 బ్యాటరీలు) రూ.1,00,000 నగదును రికవరీ చేశారు. నిందితుల వద్ద నుంచి పోలీసులు మొత్తం రూ.1,85000 నగదు, 25 బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేధించిన పోలీసు బృందాన్ని ఏసీపీ నర్సింహులు ప్రత్యేకంగా అభినందించారు

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ

మిరుదొడ్డి, నవంబరు25(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా కొంతమేరకు నేరాలు అదుపులో ఉంటాయని దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతే ప్రాథమిక పాఠశాలలోని అనదపు తరగతితోపాటు భూంపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సీసీ కెమెరాలను రాష్ట్ర ఎస్సీ ఎస్టీకమీషన్ చైర్మన్ బక్కివెంకటయ్యతో కలిసి ప్రారంభించారు. ఏమైనా సంఘటన జరిగిప్పుడు వ్యక్తులను పట్టుకోవడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. అనంతరం మండలంలోని రుద్రారం గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు ప్రభాకర్‌రావు తల్లీ మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.

వరికోతకు అడ్డుగా విద్యుత్ తీగలు

జగదేవ్‌పూర్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మునిగడపలో రైతుల పొలంలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదానికి దారితీసే పరిస్థితి నెలకొంది. వరి పంట కోతకు సిద్ధంగా ఉన్నప్పటికీ పొలంలో వేలాడుతున్న తీగల కారణంగా చేతికి వచ్చిన పంట కొయ్యలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మబ్బులు పడుతుండడంతో వర్షం వచ్చి పంట దెబ్బ తింటుందేమోనని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. పంట పొలాల్లో వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరి చెయ్యాలని విద్యుత్ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని పలువురు రైతులు వాపోతున్నారు. రైతు ఈద్ లింగం వ్యవసాయ పొలంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరి చేయాలని విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. వేలాడుతున్న వైర్లతో ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఎలాంటి ప్రమాదం జరగక ముందే అధికారులు వెంటనే స్పందించి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలని పలువురు రైతులు వాపోతున్నారు.



మునిగడపలో రైతు వరి పొలంలో చేతులకు తాకే విధంగా ఉన్న విద్యుత్ వైర్లు

రోడ్డు భద్రత అవగాహన అవసరం



రోడ్డు భద్రత గురించి విద్యార్థులకు వివరిస్తున్న ట్రాఫిక్ ఎస్సై విజయ్‌భాస్కర్

సిద్దిపేట కల్చరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేటలోని మెరిడియన్ పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్సై విజయ్ భాస్కర్ హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం, సీట్‌బెల్ట్ పెట్టుకోవడం, వేగ పరిమితులను పాటించడం, మొబైల్ వాడకాన్ని నివారించడం వంటి జాగ్రత్తల గురించి వివరించారు. రోడ్డు ప్రమాదాలు ఎలా జరుగుతాయి, వాటిని ఎలా నివారించవచ్చని ఉదాహరణలతో వివరించారు.

వేలంలో గ్రామపంచాయతీకి రూ.6 లక్షల ఆదాయం

కొమురవెల్లి, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కొమురవెల్లి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వాహనాల పార్కింగ్ వేలం పాటను మంగళవారం డివిజనల్ పంచాయతీ అధికారి చందన అధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేలం పాటలో అంబడిపల్లి నాగరాజు రూ.6,03,000లకు హెచ్చు పాట పాడి నేటి నుంచి మార్చి 31వ తేది వరకు గల కాలపరిమితితో టెండర్ దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో ఏంపీడీవో లక్ష్మప్ప.ఎంపీవో శ్రీనివాస వర్మ, పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించాలి

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలంలోని జిల్లెలగడ్డ గ్రామ పంచాయతీని సర్పంచ్ ఎన్నిక కోసం ఎస్సీలకు రిజర్వేషన్ కేటాయించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొలుగూరి అశోక్, ఎమ్మెఎస్ఎఫ్ నియోజక వర్గ ఇన్‌చార్జి బోయిని రాజశేఖర్ మంగళవారం ఆర్డీవో రాంమూర్తికి వినతి పత్రం అందజేశారు. గత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఒక్క వార్డు కూడా ఎస్సీలకు కేటాయించలేదన్నారు. ఈ సారి జరిగే పంచాయతీ ఎన్నికల్లో జిల్లెలగడ్డ పంచాయతీని ఎస్సీ సర్పంచ్‌కే కేటాయించాలని, అలాగే రెండు వార్డులను ఎస్సీలకు రిజర్వుచేయాలని ఆర్డీవో కోరారు.

ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

గజ్వేల్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని 2003 డీఎస్సీ గజ్వేల్ డివిజన్ అధ్యక్షులు కుకునూరి శేఖర్ ప్రభుత్వాన్ని కోరారు, మంగళవారం గజ్వేల్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సెప్టెంబర్ 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఉపాధ్యాయులందరూ ఉద్యోగంలో కొనసాగాలంటే రెండు సంవత్సరాల లోపు టెట్ తప్పనిసరిగా పాస్ కావాలనడం ఉపాధ్యాయులను ఎంతో మనోవేదనకు గురిచేస్తుందన్నారు.

ఇంటర్..యాక్షన్ ప్లాన్ ఆన్..

(5వ పేజీ తరువాయి)

శిక్షణ పొందిన ఇద్దరు కౌన్సెలర్లను ఏర్పాటు చేశారు. విద్యార్థులు మానసిక ఆందోళనకు లోనైనప్పుడు అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వడానికి టెలిమానస్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఏ సయంలోనైనా 14416 అనే టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి సమస్య చెప్పి పరిష్కారం పొందడం దీని ముఖ్య ఉద్దేశం. యాంటి డ్రగ్స్ కాంపెయిన్స్ చేపట్టి మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తున్నారు. పక్కా ప్రణాళికతో ముందుకెళ్తూ ఫలితాల్లో మెరుగైన స్థానంలో జిల్లాను నిలబెట్టాలని అధికారులు పనిచేస్తున్నారు.

విద్యార్థుల ప్రగతిపై సమీక్షలు..

విద్యార్థులు ప్రతీరోజూ కళాశాలకు వచ్చి ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలి. ఎలాంటి మానసిక ఒత్తిడికి లోనూకాకుండా పరీక్షలకు ప్రిపేర్ కావాలి. 90 రోజుల యాక్షన్ ప్లాన్‌ను పక్కాగా అమలు చేసేందుకు పలు కళాశాలలను సందర్శిస్తున్నాం. అధ్యాపకులతోనూ ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి విద్యార్థుల ప్రగతి, సిలబస్, స్టడి అవర్స్ గురించి సమీక్షిస్తున్నారు.

\- రవీందర్ రెడ్డి, డీఐఈవో

అంబులెన్స్‌ల తనిఖీ

గజ్వేల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని 108,102,1962 అంబులెన్స్ వానాలను ఉమ్మడి మెదక్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ జాన్ షాహిద్ మంగళవారం తనిఖీ చేశారు, సిబ్బంది పని తీరు రికార్డులు మందులు వానాల కండిషన్ ఆయన పరిశీలించారు, సిబ్బంది పనితీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు,ఇట్టి కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఈ ఏం ఈ హరి రామ కృష్ణ, ఎఫ్ హెచ్ ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్‌లో గజ్వేల్ విద్యార్థులు



విద్యార్థులతో కోచ్ దూలం కృష్ణ

గజ్వేల్ రూరల్, నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి): ఆత్మ రక్షణకు కరాటే ఎంతగానో ఉపయోగపడుతుందని కరాటే కోచ్ దూలం కృష్ణ అన్నారు, మంగళవారంహైదరాబాద్ సరూర్ నగర్ లోని ఇండోర్ స్టేడియంలో విజన్ మార్షల్ ఆర్ట్స్ కరాటే అకాడమీ అధ్వర్యంలో లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ కిక్ ఛాలెంజ్‌లో గజ్వేల్ రుద్రమదేవి చోటోకాన్ కరాటేఅకాడమీ నుండి 14 విద్యార్థులకు చోటుదక్కడం కోచ్ దూలం కృష్ణ హర్షం వ్యక్తం చేశారు, సందర్భంగా వారు మాట్లాడుతూ మా విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచినందుకు లీమ్కా బుక్ అఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కడం వారి కృషి, పట్టుదలే కారణం అన్నారు.

నేడు రాజ్యాంగ దినోత్సవంపై సదస్సు

హుస్నాబాద్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి):పట్టణంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు జేఏసీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్ తెలిపారు. ఈ సందస్సుకు నల్సార్ లా యూనివర్సిటీ ప్రొఫెసర్ వాగీషన్ వక్తగా హాజరవుతున్నారన్నారు.

బీసీ రిజర్వేషన్ల విషయంలో మోసం చేసిన కాంగ్రెస్

- స్థానిక ఎన్నికల్లో లబ్ధి కోసమే ఇందిరమ్మ చీరలు
- గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, నవంబరు 25(ఆంధ్ర జ్యోతి): బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేసిందని బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రెండేళ్లుగా ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎన్నికల నేపథ్యంలో చీరలు, పథకాల పేరుతో ప్రజలను మభ్య పెట్టడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అందజేస్తామని, 23శాతం రిజర్వేషన్లను కూడా ఇవ్వని పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. గతంలో పార్టీలకు అతీతంగా బతుకమ్మ చీరలను అందజేశామని, కానీ ప్రస్తుత ప్రభుత్వం రెండేళ్ల అనంతరం ఇందిరమ్మ చీరల పేరిట ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తుందని, ప్రభుత్వ సొమ్ముతో కాంగ్రెస్ పార్టీ నాయకులకు లబ్ధి చేకూరేలా పనిచేస్తున్నారని మండిపడ్డారు. రెండేళ్లలో రెండున్నర లక్షల కోట్ల అప్పు చేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైడ్రాను, మీడియాను అడ్డుపెట్టుకుని బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడి కోట్లాది రూపాయలు సంపాదిస్తున్నారని ఆరోపించారు. ఆయనవెంట మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ దాసరి అమరావతి, మాజీ జడ్పీటీసీ పంగ మల్లేశం, నాయకులు బెండ మధు, బోల్లారం ఎల్లయ్య, మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్ రెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, రమేశ్, పోచయ్య, రఘుపతిరెడ్డి, ఉమర్ తదితరులున్నారు.

విద్యార్థులకు ఫైనాన్షియల్ లిటరసీపై అవగాహన

రాయపోల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాయపోల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఫైనాన్షియల్ లిటరసీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల నుంచి రాయపోల్‌లోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వరకు ర్యాలీ నిర్వహించారు. బ్యాంక్ వద్ద మేనేజర్ శ్రీన్వాస్ పాల్ విద్యార్థులకు మనీ ఎలా డిపాజిట్ చేయాలి, ఎలా విత్‌డ్రా చేయాలి, ఏటీఎం కార్డు, డెబిట్‌కార్డు, చెక్‌బుక్, క్రాప్‌లోన్‌లు, హౌస్‌లోన్‌లు, వెహికిల్ లోన్‌లు వంటి అంశాలు వివరాలు వివరించారు. సుకన్య సమృద్ధి యోజన పథకంపై అవగాహన కల్పించారు. అలాగే రైతు కర్ల నర్సారెడ్డి పాలీహౌజ్ వ్యవసాయంపై అవగాహన కల్పించారు.

పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

సిద్దిపేట అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ కూలీలు గ్రామీణ పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్ అన్నారు. మంగళవారం సిద్దిపేటలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను మహిళలకు ఇచ్చిన పెన్షన్ హామీని వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శశిదర్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి రవీంద్ర చారి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డంప్ యార్డు తరలింపుకు ఆదేశాలు

- తీరనున్న స్థానిక ప్రజల సమస్యలు

కోహెడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 68 సర్వే నంబర్‌లో గల బాడుగుల చెరువు పక్కన ఉన్న డంపింగ్ యార్డు వల్ల ప్రజల తీవ్ర ఇబ్బందులను స్థానిక ప్రజలు కోహెడలో ఆదివారం పర్యటన సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకొచ్చారు. మంత్రి స్పందించి జిల్లా కలెక్టర్‌తో ప్రజల సమక్షంలో మాట్లాడారు. మంగళవారం జిల్లా కలెక్టర్ డంప్ యార్డు మార్పునకు ఆదేశాలు జారీ చేశారు. కోహెడ మండలంలోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 998 లో 2 ఎకరాల భూమిని డంప్ యార్డు కొరకు కేటాయిస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. డంప్ యార్డు తరలించడం వల్ల స్థానిక ప్రజల సమస్యలు, అక్కడే చెరువులో చేపల వృత్తి మీద ఆధారపడి జీవిస్తున్న మత్యకారుల కుటుంబాల సమస్యలు తీరనున్నట్లు వెల్లడించారు. డంపింగ్ యార్డు తరలింపుతో నివాస ప్రాంతాల సమీపంలో ఉన్న డంపింగ్ యార్డుల వల్ల వచ్చే కాలుష్యం, దుర్వాసన, ఆరోగ్య సమస్యలు తొలగనున్నాయి.

మంత్రులను కలిసిన డీసీసీ అధ్యక్షురాలు



మంత్రి శ్రీధర్‌బాబుతో డీసీసీ చీఫ్ ఆంక్షారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

గజ్వేల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా ఎన్నికైన తూంకుంట ఆంక్షారెడ్డి రాష్ట్ర మంత్రులను మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ధనసరి సీతక్క, వాకిటి శ్రీహరి, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌లను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు ఆంక్షారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. వారితో మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, నాయకులు తదితరులున్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం ప్రారంభం

హుస్నాబాద్ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంగళవారం నుంచి 1 జనవరి 2026 వరకు ఆలయంలో ప్రతి రోజు అన్నదాన కార్యక్రమం ఉంటుందని దేవస్థాన కమిటీ చైర్మెన్ ఆకుల వెంకట్ తెలిపారు.

ఆటల పోటీలు మనోవికాసానికి దోహదపడతాయి

చేర్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆటల పోటీలు విద్యార్థుల మనోవికాసానికిదోహద పడతాయని చేర్యాల ఎంఈవో రచ్చ కిష్టయ్య అన్నారు. చేర్యాల పట్టణంలోని పీఎంశ్రీ గురుకుల పాఠశాలలో మంగళవారం నిర్వహించిన పాఠశాల స్థాయి ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కళాజాత



ఆకునూరు గ్రామంలో నిర్వహించిన కళాజాత లో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

చేర్యాల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పోషకాహారం పట్ల అవగాహన కల్పిస్తూ చేర్యాల ఐసీడీఎస్, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో మంగళవారం కళాకారులచే ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా కళాకారులు ఆట, పాటలతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహార లోపం వలన కలిగే అనర్థాలు, వినియోగం వలన కలిగే ప్రయోజనాన్ని వివరించారు. సీడీపీవో రమాదేవి, సూపర్‌వైజర్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మీర్జాపూర్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ గ్రామంలో వివిధ కారణాలతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందిన లబ్ధిదారులకు మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. రేగుల రాజేశ్వరికి రూ. 25000, నాంపల్లి ఎల్లయ్యకు రూ. 25000 వేల చెక్కులను కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు వేల్పుల సంపత్ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా చెక్కులు అందజేసిన రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తుల పంపిణీ

కొమురవెల్లి, నవంబరు25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిముస్త్యాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం మాజీ ఏంపీపీ తలారి కీర్తనకిషన్ విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ చేశారు.